సాక్షి కామారెడ్డి

గురువారం । 4 । జనవరి । 2024



సిలబస్ పూర్తి చేయాలి

ప్రభుత్వ కళాశాలల్లో సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని ఇంటర్ నోడల్ అధికారి సలాం సూచించారు.

- 9లో ▸



అక్షింతల పంపిణీ

అయోధ్యనుంచి వచ్చిన శ్రీరామ పూజిత అక్షింతలను హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఇంటింటికి పంపిణీ చేస్తున్నారు.

- 10లో ▸



వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

సోమాయప్ప స్వామీజీకి అందిన ఆహ్వానం



బిచ్కుంద: అయోధ్యలో శ్రీరామచంద్రుడి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి బిచ్కుందలోని బండాయప్ప మఠం పీఠాధిపతి సోమలింగ శివాచార్య మహాస్వామి(సోమాయప్ప స్వామీజీ)కి ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ప్రజలు ఎన్నో ఏళ్లనుంచి ఎదురు చూస్తున్న అయోధ్యలో రామమందిర నిర్మాణ కల నెరవేరుతోందన్నారు. రాముడి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొనాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నుంచి ఆహ్వానం అందినందుకు సంతోషంగా ఉందన్నారు. ట్రస్ట్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

నేడు పోచారం నీటివిడుదల

నాగిరెడ్డిపేట: యాసంగి పంటలసాగు కోసం గురువారం పోచారం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. మధ్యాహ్నం 1 గంటలకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు చేతులమీదుగా నీటి విడుదలను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, ఆయకట్టు రైతులు నీటివిడుదల కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

రేపు అండర్‌-20 కబడ్డీ జట్ల ఎంపిక

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని లయోలా ఉన్నత పాఠశాలలో శుక్రవారం అండర్‌-20 కబడ్డీ బాలబాలికల జట్లను ఎంపిక చేయనున్నారు. ఈ విషయాన్ని జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రంగ వెంకటేశ్వరగౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి బాణాల భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 65 కిలోలలోపు బాలికలు, 70 కిలోల లోపు బాలురు ఎంపిక పోటీలకు హాజరు కావాలని, ఇతరవివరాలకు 93985 71110 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

6 న జాబ్ మేళా..

కామారెడ్డి క్రైం: కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పన కార్యాలయంలో ఈనెల 6న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేటీఎం కంపెనీలో పలు ఉద్యోగాల భర్తీ కోసం ఈ మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పదో తరగతి ఆపైన చదివిన 18 నుంచి 30 ఏళ్ల లోపు వారు ఆయా ఉద్యోగులకు అర్హులని తెలిపారు. ఆసక్తిగలవారు 6న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని, ఇతర వివరాలకు 95739 73688, 76719 74009, 98482 37987 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

7 నుంచి జాతీయ కబడ్డీ క్రీడలు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డిలో ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్‌-17 జాతీయ స్థాయి బాలుర కబడ్డీ చాంపియన్‌షిప్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని డీఈవో రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో దేశంలోని 44 జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. పోటీలు నిర్వహించడానికి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల మైదానాల్లో ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పోటీలకు సంబంధించిన సమాచారం కోసం 79950 87612, 99590 57923 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.


వీగిపోయిన అవిశ్వాసం



రాజంపేట: రాజంపేట సొసైటీ చైర్మన్ అశోక్, వైస్ చైర్మన్ రమేశ్‌లపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిందని జిల్లా సహకార సంఘం సూపరింటెండెంట్ భూమయ్య తెలిపారు. జిల్లా సహకార సంఘం అధికారి ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొంటున్నందున సమావేశ నిర్వహణ బాధ్యతలను జిల్లా సహకార అధికార కార్యా లయం సూపరింటెండెంట్ భూమ్మయ్యకు అప్పగించారు. దీంతో ఆయన బుధవారం అవిశ్వాస తీర్మానం కోసం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటలకు సమావేశానికి హాజరు కావాల్సి ఉండ గా 11.30 గంటల వరకు ఒక్కరూ రాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు సూపరింటెండెంట్ ప్రకటించారు. సహకారం సంఘం చట్టం ప్రకారం ఏడాది వరకు తిరిగి అవిశ్వాస తీర్మానం పెట్టడానికి అవకాశం లేదని పేర్కొన్నారు.

చిగురిస్తున్న ఆశలు

- మెగా డీఎస్సీ నిర్వహిస్తామని సీఎం ప్రకటన
- నిరుద్యోగుల్లో హర్షం



సాక్షి, కామారెడ్డి: జిల్లాలో మండల, జిల్లాపరిషత్ స్కూళ్లు 988 ఉండగా.. వాటిలో 82,847 మంది విద్యార్థులున్నారు. అలాగే స్టేట్ గవర్నమెంట్ స్కూళ్లు 23 ఉండగా.. వాటిలో 2,955 మంది చదువుతున్నారు. చాలా గ్రామాల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడంతో స్కూళ్లు మూతబడ్డాయి. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయి స్కూళ్లను ఎత్తేశారు. గతంలో పన్నెండు వందల పైచిలుకు ఉన్న స్కూళ్లు ఏడాదికేడాది తగ్గుతూ వచ్చాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేకపోవడం, సరిపడా ఉపాధ్యాయులను నియమించకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. కొన్నిచోట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోనూ విద్యార్థుల సంఖ్య భారీగా పడిపోయి, టీచర్లు ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

గణనీయంగా తగ్గిన ఖాళీలు..

జిల్లాలో గతంలో 1,250 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండేవి. అయితే 317 జీవో మూలంగా నిజామాబాద్ జిల్లా నుంచి అదనంగా టీచర్లు రావడంతో ఖాళీలు తగ్గిపోయాయి. దీనికి తోడు స్కూల్ మ్యాపింగ్, విలీనంతో ఖాళీల సంఖ్య 200 కు పడిపోయింది. ఇది నిరుద్యోగులను ఎంతో నిరాశకు గురిచేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల ప్రమోషన్లతో పాటు, అన్ని గ్రామాల్లో స్కూళ్లు ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో పోస్టుల సంఖ్య పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలంటే మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు సరిపడా ఉపాధ్యాయులను నియమించాల్సిన అవసరం ఉంది.

పుస్తకాల దుమ్ము దులుపుతున్న నిరుద్యోగులు..

పాఠశాలల విలీనంతో చాలా గ్రామాలలో సర్కారు విద్య అందడం లేదు. ఆయా గ్రామాలలో బడులను నిర్వహిస్తే విద్యార్థులకు మేలు జరగడంతో పాటు నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో విద్యాశాఖపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి ఊరిలో సర్కారు బడి ఉండాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. మెగా డీఎస్సీ వేస్తామన్న సీఎం ప్రకటనతో నిరుద్యోగులు మళ్లీ పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొందరు రెగ్యులర్‌గా ప్రిపేర్ అవుతుండగా, పోస్టులు పెరుగుతాయన్న ఆశతో మరికొందరు పుస్తకాల దుమ్ముదులిపి టెట్, డీఎస్సీలకు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో ముప్పైవేల మంది వరకు బీఎడ్, డీఎడ్ చదివిన నిరుద్యోగులు ఉన్నారు. వారిలో కొందరి వయసు మీరిపోగా, మిగతావారు సర్కారు ఉపాధ్యాయ కొలువుల మీద ఆశతో ఉన్నారు. డీఎస్సీకన్నా ముందుగానే ప్రభుత్వం టెట్ నిర్వహించే అవకాశాలు ఉండడంతో చాలామంది అటు టెట్, ఇటు డీఎస్సీకి ప్రిపేర్ అయ్యేందుకు రెడీ అవుతున్నారు.

పోస్టులు పెంచాలి..



మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అలాగే పోస్టులు పెంచితే చాలామందికి మేలు జరుగుతుంది.

– అనిల్‌కుమార్, ఎంఏ బీఈడీ, ఎల్లారెడ్డి

ఆచరణలోకి తేవాలి




ప్రతి గ్రామంలో పాఠశాలను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. మూతబడిన పాఠశాలలను సైతం తెరుస్తామన్నారు. ఆయన ప్రకటనను ఆచరణలోకి తెస్తే చాలా మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

– నాగరాజుగౌడ్, బీఈడ్, ఎల్లారెడ్డి

కొండెక్కిన కోడిగుడ్డు

- భారీగా పెరిగిన ధర
- చికెన్‌దీ అదే దారి..
- ఇబ్బందిపడుతున్న సామాన్యులు



కామారెడ్డి టౌన్: నిత్యావసరాల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. మొన్నటివరకు ఉల్లిగడ్డలు, టమాటాల ధరలు ఆకాశాన్నంటగా.. ప్రస్తుతం కోడిగుడ్లు, చికెన్ వంతొచ్చింది. కార్తీక మాసంలో మాంసాహార వినియోగం తక్కువగా ఉండడంతో ధరలు అదుపులో ఉన్నట్లు కనిపించాయి. కార్తీక మాసం ముగియడంతోనే కోడిగుడ్లు, చికెన్ ధరలకు రెక్కలొచ్చాయి. గత నెలలో ఒక్కో గుడ్డు ధర రూ.5.50 ఉండగా.. వారం క్రితం రూ.6కు చేరింది. డజన్ గుడ్ల ధర వారం రోజుల్లో రూ.72 నుంచి రూ.84కు చేరింది. రిటైల్ మర్కెట్‌లో ఒక గుడ్డును రూ. 8కి అమ్ముతున్నారు. చలి తీవ్రత పెరగడం, ఉత్పత్తి తగ్గడంతో కోడిగుడ్ల ధర పెరుగుతోందని భావిస్తున్నారు. అలాగే చికెన్ ధర కూడా అమాంతంగా పెరిగిపోయింది. గత నెలలో కిలో చికెన్ ధర రూ.160 నుంచి రూ.190 లోపు ఉంది. ప్రస్తుతం చికెన్ ధర రూ. 250కి చేరింది. రానున్న రోజుల్లో చికెన్‌ధర మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ధరలు పెరుగుతుండడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు.

‘గృహలక్ష్మి’కి గుడ్‌బై

- పథకానికి స్వస్తి పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం
- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ప్రొసీడింగ్‌లు బుట్టదాఖలే..

మోర్తాడ్: గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన గృహలక్ష్మి పథకానికి కొత్త ప్రభుత్వం గుడ్‌బై చెప్పింది. పథకాన్ని రద్దు చేస్తూ జీవో జారీచేసింది. దీంతో ఎన్నికలకు ముందు జారీచేసిన ప్రొసీడింగ్‌లు రద్దయ్యాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టడంతో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. దీంతో గృహలక్ష్మి ప్రొసీడింగ్ కాపీల చెత్తబుట్టలో పారవేయాల్సిందేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను గృహలక్ష్మి పథకం కింద ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 3లక్షల సాయాన్ని అందించడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులను కేటాయించింది. ఒక్కో నియోజకవర్గంలో 3వేల ఇళ్ల నిర్మాణానికి సాయం అందించాలని నిర్ణయించారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులే గ్రామాల్లో లబ్ధిదారులను ఎంపిక చేసి గుట్టుచప్పుడు కాకుండా ప్రొసీడింగ్ కాపీలను పంపిణీ చేశారు. ఈ కాపీలపై కలెక్టర్ల ఆదేశాలతో జారీ చేసినట్లు ఎంపీడీవోల హోదాను పేర్కొంటూ రాసి ఉంది. కానీ కాపీలపై ఏ అధికారి సంతకం లేకపోవడం గమనార్హం. ఎన్నికల తేదీ ఖరారైన తర్వాత కూడా కాపీలను లబ్ధిదారులకు అందించారు. అధికారుల సంతకాలు లేకపోవడంతో అవి చెల్లుబాటు కావని అప్పట్లోనే ప్రచారం జరిగినా ఎవరూ పట్టించుకోలేదు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ. 5లక్షల చొప్పున సాయం అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ లెక్కన గత ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి పథకం కంటే ఇందిరమ్మ ఇంటికే ఎక్కువ సాయం అందుతుంది. దీంతో గతంలోని ప్రొసీడింగ్‌ల ద్వారా సాయం పొందడంకంటే కొత్తగా ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం మంజూరు చేయించుకోవడం మంచిదనే భావన కలుగుతోంది. గృహలక్ష్మి కింద లబ్ధిదారులుగా ఎంపికైన వారు ఇందిరమ్మ ఇళ్ల కోసం మరోసారి దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది.

షెడ్లు సరే.. శిక్షకులేరి!

- జిల్లాలో 16 చోట్ల యోగాషెడ్ల నిర్మాణం
- శిక్షకుల నియామకంలో జాప్యం
- ఏడాదిగా వృథాగా ఉంటున్న షెడ్లు

నాగిరెడ్డిపేట: గ్రామీణ ప్రాంత ప్రజలు మానసిక ఒత్తిడి, ఇతర అనారోగ్య సమస్యలను జయించడం కోసం ప్రభుత్వం జిల్లాలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వద్ద యోగా షెడ్ల నిర్మాణం చేపట్టింది. ఆరోగ్య పరిరక్షణతోపాటు పీహెచ్‌సీలకు వచ్చే గర్భిణులతో సైతం యోగా చేయించి సుఖ ప్రసవాల సంఖ్యను పెంపొందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేశారు. నేషనల్ ఆయుష్ మిషన్‌లో భాగంగా జిల్లాలో 16 మండలాల్లో ఏడాది క్రితమే యోగా షెడ్లను నిర్మించారు. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.4 లక్షల నుంచి రూ.5లక్షల వరకు నిధులను వెచ్చించారు. కాగా షెడ్ల నిర్మాణం పూర్తై ఏడాదికావస్తున్నా యోగా శిక్షకులను నియమించకపోవడంతో వృథాగా ఉంటున్నాయి. శిక్షకులను నియమిస్తేనే షెడ్ల నిర్మాణ లక్ష్యం నెరవేరే అవకాశాలున్నాయి. సర్కారు స్పందించి, యోగా శిక్షకులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.



నాగిరెడ్డిపేటలో వృథాగా ఉన్న యోగా షెడ్డు

ప్రజాపాలనలో దరఖాస్తుల వెల్లువ

- ఐదు రోజుల్లో 1,92,525 అర్జీలు
- మిగిలింది మూడు రోజులే..

సాక్షి, కామారెడ్డి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. వంద కుటుంబాలకు ఒక కౌంటర్ చొప్పున ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ నిత్యం మండలాల్లో పర్యటిస్తూ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులను ఒక్కో మండలానికి ఇన్‌చార్జీగా నియమించి, కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు.

జిల్లాలో 526 పంచాయతీలు, మూడు బల్దియాల పరిధిలో 80 వార్డులు ఉన్నాయి. మండలాల్లో ఎంపీడీవో, తహసీల్దార్‌లు రెండు బృందాలుగా ఏర్పడి రోజూ రెండు గ్రామాల్లో సభలు నిర్వహిస్తూ ప్రజలనుంచి దరఖాస్తులు తీసుకుంటున్నారు. గతనెల 28న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమైన విషయం తెలిసిందే.. 29, 30 తేదీలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. 31తోపాటు జనవరి ఒకటో తేదీ సెలవు కావడంతో కార్యక్రమం సాగలేదు. 2, 3 తేదీలలో ప్రజాపాలన కొనసాగింది. ఇంకా ఈ నెల 4, 5, 6 తేదీలలో ప్రజాపాలన నిర్వహించనున్నారు. ఐదు పనిదినాలలో జిల్లాలో 416 గ్రామ, వార్డు సభలు నిర్వహించగా.. 1,92,525 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 2,06,499 కుటుంబాలు, పట్టణ ప్రాంతాల్లో 43,563 కుటుంబాలు నివసిస్తున్నాయి. కాగా ఐదు రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో 1,58,741 మంది, పట్టణ ప్రాంతాల్లో 33,784 కుటుంబాలు ప్రజాపాలనకు సంబంధించిన దరఖాస్తులు అందించాయి. మరో 7,058 మంది ఇతర అంశాలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్నారు. మొదట్లో దరఖాస్తుల కొరతతో ఇబ్బందులు ఎదురయ్యాయి. తర్వాత కావలసినన్ని దరఖాస్తులు అందుబాటులో ఉంచడంతో సమస్య తీరింది.



బ్రాహ్మణపల్లిలో అధికారులు, ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

జిల్లాలో డివిజన్ల వారీగా వచ్చిన దరఖాస్తుల వివరాలు..

రెవెన్యూ డివిజన్	గ్రామీణ ప్రాంతాల్లో దరఖాస్తులు	పట్టణ ప్రాంతాల్లో దరఖాస్తులు	మొత్తం దరఖాస్తులు
కామారెడ్డి	70,817	23,441	94,258
ఎల్లారెడ్డి	26,894	3,762	30,656
బాన్సువాడ	61,030	6,581	67,611
మొత్తం	1,58,741	33,784	1,92,525

బ్రాహ్మణపల్లిలో..

తాడ్వాయి: బ్రాహ్మణపల్లిలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని కలెక్టర్ బుధవారం పరిశీలించారు. దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఏదైనా కారణంతో గ్రామ సభ రోజు అప్లికేషన్ ఇవ్వనివారు ఈనెల 6వ తేదీలోగా పంచాయతీలో సమర్పించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో రాజ్‌వీర్, మండల నోడల్ అధికారి వీరనందు, అధికారులు ఉన్నారు.

మెట్రో రైలులో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్: జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు హైదరాబాద్‌లో మెట్రోరైలులో సామాన్యుడిలా ప్రయాణించారు. ఆయన మంగళవారం నేషనల్ హైవే అథారిటీ అధికారులతో సమావేశంలో పాల్గొనేందుకు హైదరాబాద్ వెళ్లారు. ఆయన వాహనం ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడంతో సమీపంలోని మెట్రో స్టేషన్‌కు వెళ్లి రైలు ఎక్కారు. సాధారణ ప్రయాణికుడిలా మెట్రో రైలులో ప్రయాణించి గమ్యం చేరుకున్నారు.



రెఫరల్ దందా!

వ్యాపారంగా మారిన వైద్యం

- ప్రైవేటు ఆస్పత్రికి పంపితే 50 శాతం కమీషన్
- గోవా, బ్యాంకాక్ ట్రిప్ ఆఫర్లు సైతం..
- సొమ్ము చేసుకుంటున్న ఆర్‌ఎంపీలు, పీఎంపీలు
- చాలా ప్రైవేటు ఆస్పత్రుల్లో ఇదే తంతు

■ నందిపేట్ మండలానికి చెందిన గంగారాం(పేరుమార్చాం) జ్వరం రావడంతో స్థానికంగా ఉండే ఆర్‌ఎంపీ వద్దకు వెళ్లాడు. సూదితో పాటు రెండు రోజులకు సరిపడా మందులు ఇచ్చాడు. తన ఫీజు రూ. 500 అయ్యింది. మూడు రోజులైనా జ్వరం తగ్గకపోవడంతో మళ్లీ వెళ్లగా.. డెంగీ టెస్ట్ చేయడంతో పాజిటివ్ వచ్చిందని చెప్పాడు. ఇక్కడ ఉంటే ప్రాణానికే ప్రమాదమని జిల్లా కేంద్రంలోని ప్రముఖ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తే త్వరగా నయం అవుతుందని చెప్పి.. తన వాహనంలో తీసుకెళ్లి అడ్మిట్ చేశారు. ఐదు రోజులు చికిత్స పొందడంతో రూ. 40 వేల ఆస్పత్రి బిల్లు, రూ. 20 వేలు మెడికల్ బిల్లు కలిపి రూ. 60 వేలు ఖర్చయ్యింది. ఇందులో 40 శాతానికి పైగా కమీషన్ రూపంలో ఆస్పత్రి నిర్వాహకులు సదరు ఆర్‌ఎంపీకి ఇచ్చారు.


నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని అనేక ప్రైవేటు ఆస్పత్రుల్లో ‘రెఫరల్’ దందా విచ్చలవిడిగా సాగుతోంది. వైద్యాన్ని వ్యాపారంగా మార్చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఆర్‌ఎంపీలు, పీఎంపీలు రోగులను తమ ఆస్పత్రికి రెఫర్ చేయాలని సంప్రదిస్తున్నారు. రెఫర్ చేసినందుకు రోగి ఫీజులో 50శాతం కమీషన్ చెల్లిస్తున్నారు. అంతేకాకుండా ఎక్కువ మంది పేషెంట్లను పంపిన వారికి గోవా, బ్యాంకాక్ ట్రిప్పులను సైతం ఆఫర్ చేస్తుండడం విశేషం. ఇదే అదునుగా కొందరు ఆర్‌ఎంపీలు, పీఎంపీలు తమకు ఆస్పత్రే అని.. తక్కువ ఫీజు అవుతుందని చెప్పి కమీషన్ మాట్లాడుకున్న ప్రైవేటు ఆస్పత్రులకు పంపించి.. కమీషన్లు వసూలు చేస్తున్నారు. జిల్లాలోని అనేక ప్రైవేటు ఆస్పత్రుల్లో ఇదే తంతు కొనసాగుతోందనేది బహిరంగ రహస్యం.

పుట్టగొడుగుల్లా ఆస్పత్రులు వెలుస్తుండడంతో..

జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. నగరంలోనే 400 వరకు ప్రైవేటు హాస్పిటళ్లు ఉన్నాయి. ఇందులో 50 వరకు మల్టీ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులున్నాయి. ఒకప్పుడు వైద్యం కేవలం ఎంబీబీఎస్, ఎండీ ఇలా ఆపైన చదివిన వారు మాత్రమే క్లినిక్‌లు పెట్టుకొని రోగులకు వైద్యం చేసేవారు. గత పదేళ్లలో వైద్యం వ్యాపారంగా మారిపోయింది. ముగ్గురు, నలుగురు కలిసి ఈ దందాలోకి దిగుతున్నారు. ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకుని ఆస్పత్రులు ఏర్పాటు చేస్తున్నారు. వైద్యులను నియమించుకుని వైద్యం అందిస్తున్నారు. పెట్టిన పెట్టుబడిని కేవలం ఏడాదిలోపే సంపాదించేలా ప్రణాళిక వేసుకుని కమీషన్ల దందాకు తెరతీస్తున్నారు. ఇందుకోసం గ్రామాల్లోని ఆర్‌ఎంపీ, పీఎంపీలతో కమీషన్లు మాట్లాడుకుంటున్నారు.

రోగి ఫీజులో సగం కమీషన్..

జిల్లాలో పట్టణాలు, పల్లెల్లో కలిపి సుమారుగా 3వేల వరకు ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఉన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు ఆర్‌ఎంపీ, పీఎంపీల వివరాలు సేకరించి వారిని సంప్రదిస్తున్నారు. ఆస్పత్రిలో చేరిన రోగి బిల్లులో 40శాతం నుంచి 50శాతానికిపైగా కమీషన్ ఇచ్చేలా ముందస్తుగానే ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఒప్పందం ప్రకారం వారం, లేదంటే నెలకోసారి కమీషన్ ముట్టజెబుతున్నారు.



సేవ పేరిట దోపిడీ

పల్లెలో సేవ పేరుతో కొంతమంది ఆర్‌ఎంపీ, పీఎంపీలు వ్యాపారం చేస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రులు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తిపడి వైద్యాన్ని వ్యాపారంగా మార్చుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులను అవసరం లేకపోయినా జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. దీంతో రోగుల జేబులు ఖాళీ అవుతున్నాయి. ఇంత జరుగుతున్నా వైద్యశాఖ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం.

విహారయాత్రలకూ..

ప్రైవేటు ఆస్పత్రుల నిర్వా హకులకు కమీషన్‌తో పాటు విహారయాత్రల ఆఫర్లూ ఇస్తున్నారు. ఆర్‌ఎంపీలు, పీఎంపీలను గ్రూపులుగా గోవా, బ్యాంకాక్ తదితర ప్రాంతాలకు ట్రిప్పులకు పంపిస్తున్నారు. ఇందుకు అవసరమైన ఖర్చు మొత్తం వారే చూసుకుంటున్నారు.

చెప్పినా వినిపించుకోవడంలేదు

ప్రజల్లో అవగాహన లేకనే రోగులను ఆర్‌ఎంపీ, పీఎంపీలు మోసం చేస్తూ కమీషన్ల కోసం ప్రైవేటు ఆస్పతులకు రెఫర్ చేస్తున్నారు. పీహెచ్‌సీ ఆస్పత్రులున్నా రోగులు ఆర్‌ఎంపీ, పీఎంపీల వద్దకు వెళ్తున్నారు. వాళ్లు చెప్పే మాటలను నమ్మి రోగులు మోసపోతున్నారు. జిల్లాలో ప్రస్తుతం మూడు ఆర్‌ఎంపీ, పీఎంపీ యూనియన్లు ఉన్నాయి. గతంలో చాలా సార్లు చెప్పినా వినిపించుకోవడం లేదు.

– డాక్టర్ సుదర్శనం, డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



డిచ్‌పల్లి: జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 హ్యాండ్ బాల్ పోటీలకు మండలంలోని ధర్మారం(బి) సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థినులు డి.నవనీత, బి.వర్ష ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బి.సంగీత బుధవారం తెలిపారు. ఇటీవల మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో మంచి ప్రతిభను కనబర్చడంతో హర్యానాలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు వీరు ఎంపికైనట్లు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులను ప్రిన్సిపాల్ సంగీత, జిల్లా సోషల్ వెల్ఫేర్ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ నీరజారెడ్డి, పీఈటీ ఓస జ్యోత్స్న, హౌస్ టీచర్ తదితరులు అభినందించారు.

విద్యార్థులకు సీపీ అభినందన



సిరికొండ: జాతీయ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో, స్కాట్స్ గైడ్స్‌లో ప్రతిభ కనబర్చిన సిరికొండ సత్యశోధక్ పాఠశాల విద్యార్థులను సీపీ కల్మేశ్వర్ బుధవారం అభినందించారు. జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వర్షిత్, రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్‌లో తనుజ్, సిద్ధార్థ, వర్షిత్, బేస్‌బాల్‌లో రిత్విక్, రోహిత్, స్కాట్స్ గైడ్స్ పరేడ్‌లో రచన, లిఖిత, ప్రీతి, సాత్విక్, మణివర్ధన్, సాయికిరణ్‌లకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను సీపీ అందజేసి సత్కరించారు. ప్రిన్సిపాల్ నర్సయ్య, ఉపాధ్యాయులు సంతోష్, శేఖర్ పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ కోచ్‌లుగా జాగిర్యాల్ గ్రామస్తులు


సంగెం ప్రశాంత్


సంగెం రాహుల్

భీమ్‌గల్: మండలంలోని జాగిర్యాల్ గ్రామానికి చెందిన సంగెం రాహుల్, సంగెం ప్రశాంత్ జాతీయ బాస్కెట్‌బాల్ జట్టుకు కోచ్‌లుగా ఎంపికయ్యారు. అండర్ 14, 17 బాల బాలికల బాస్కెట్‌బాల్ జట్టుకు కోచ్‌లుగా వ్యవహరించనున్నారు. రాహుల్ హెడ్ కోచ్‌గా, ప్రశాంత్ కోచ్‌గా ఉంటారు.

బల్దియాలో 3,269 ప్రజాపాలన దరఖాస్తులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలో అన్ని వార్డుల్లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది.బుధవారం 3,269 దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ దేవేందర్ తెలిపారు.గత నెల 28 నుంచి ఇప్పటి వరకు మొత్తం23,441 దరఖాస్తులు వచ్చాయి.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

బిచ్కుంద: మండలంలోని పెద్ద దేవాడలో బాల్య వివాహాన్ని బుధవారం అధికారులు అడ్డుకున్నారు. బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం రావడంతో ఐసీడీఎస్, రెవెన్యూ అధికారులు గ్రామానికి చేరుకొని అడ్డుకున్నారు. ఇరుకుటుంబాలకు కౌన్సెలింగ్ ఇచ్చి బాల్య వివాహంతో కలిగే నష్టాలను వివరించారు. 18 ఏళ్లు నిండే వరకు అమ్మాయి పెళ్లి చేయొద్దని సూచించారు. వయస్సు నిండిన తర్వాత పెళ్లి చేస్తామని రెండు కుటుంబాలు ఒప్పుకొని ఒప్పంద పత్రం రాసి ఇచ్చారు. తహసీల్దార్ లక్ష్మణ్, సీడీపీవో సునంద, మండల సూపర్‌వైజర్ కోమురవ్వ, సర్పంచ్ శివానందప్ప పాల్గొన్నారు.

ఎర్రజొన్నపై చలి ప్రభావం

- వాతావరణ మార్పులతో గింజలు రాని పంట
- ఆందోళనలో రైతులు


గింజలు వృద్ధి చెందని ఎర్రజొన్న పంట

మోర్తాడ్: వాతావరణ మార్పులతో ఎర్రజొన్న పంటకు దిగుబడి పడిపోయే అవకాశం ఉంది. గింజలు వృద్ధి చెందక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 10వేల నుంచి 15వేల ఎకరాల్లో రైతులు ఎర్రజొన్న సాగు చేస్తున్నారు. గడిచిన నెలలో వాతా వరణంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయని చిరుజల్లులు కురవడం, పగటిపూట వేడి, రాత్రిపూట చలి తీవ్రంగా ఉండటంతో ఎర్రజొన్నల సాగుపై ప్రభావం చూపిందని రైతులు పేర్కొంటున్నారు. అనేక చోట్ల గింజలు వృద్ధి చెందకపోవడంతో దిగుబడి తగ్గిపోతుందనే ప్రచారం జరుగుతోంది. ఎక రం విస్తీర్ణంలో సాగు చేసిన ఎర్రజొన్న పంటకు 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఈ సారి గింజలు వృద్ధి చెందక పోవడంతో దిగుబడి పది క్వింటాళ్లకే పరిమితమయ్యే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. తెల్లజొన్న, ముక్కజొన్న సాగులో ఎలాంటి ఇబ్బంది లేదని రైతులు వివరించారు. ఎర్రజొన్నల దిగుబడి తగ్గితే రైతులు నష్టపోనున్నారు.

కౌశల్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పాటిల్


తపస్ డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: కౌశల్ పోస్టర్‌ను కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం ఆవిష్కరించారు. హార్ట్ ఫుల్‌నెస్ ఇనిస్టూట్ శ్రీ రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో కౌశలం అనే కార్యక్రమం ఐఏఎస్, ఐపీఎస్ ఇన్ సర్వీస్ ఆఫీసర్స్ కోసం డిజైన్ చేశారని కలెక్టర్ తెలిపారు. 15 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వయస్సు గల వారు ఈ వాల్ పోస్టర్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకొని రిజిస్టర్ అయితే ఆన్‌లైన్ ద్వారా పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణను పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో 2500 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్ భానుమతి, ప్రతినిధులు శిరీష పద్మ, శ్రీరామ్, సురేందర్, సురేష్ పాల్గొన్నారు.

తపస్ డైరీ..

కామారెడ్డి టౌన్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) నూతన డైరీని కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు పుల్లం రాఘవరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బోనకుర్ సంతోష్, రాష్ట్ర బాధ్యులు రామచందర్, జిల్లా బాధ్యులు లక్ష్మీపతి, శ్రీనివాస్ గౌడ్, సంగమేశ్వర్ గౌడ్, దత్తాచారి, సంతోష్, భాస్కర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలి


దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

రెంజల్: ప్రజాపాలనలో వచ్చే దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలని మండల అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా ఆదేశించారు. మండలంలోని సాటాపూర్ జీపీలో కొనసాగుతున్న కౌంటర్లను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దరఖాస్తుదారులతో పాటు సిబ్బందికి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకునాలని ఎంపీడీవోతో చెప్పారు. గ్రామంలోని కుటుంబాల వివరాలను కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. వచ్చిన దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్ చేయించాలన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం సాటాపూర్, పేపర్‌మిల్ గ్రామాలను సందర్శించారు. అదనపు కలెక్టర్ వెంట జడ్పీ సీఈవో చందర్‌నాయక్, సర్పంచ్ ఎఖర్‌పాష, ఎంపీడీవో శంకర్, కార్యదర్శి మహబూబ్‌అలీ తదితరులు ఉన్నారు.

కుర్నాపల్లిలో..

ఎడపల్లి: మండలంలోని కుర్నాపల్లి జీపీలో కొనసాగుతున్న ప్రజా పాలన దరఖాస్తులను జిల్లా అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రా పరిశీలించారు. అనంతరం గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట ఎంపీడీవో గోపాలకృష్ణ, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

తెయూలో సావిత్రీబాయి జయంతి వేడుకలు


క్యాంపస్‌లో నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల నాయకులు వేర్వేరుగా సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో వర్సిటీ ఏబీవీపీ ఉపాధ్యక్షుడు తోట సాయికృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజు, నాయకులు సచిన్, నరేశ్, శ్రావణ్, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో వర్సిటీ అధ్యక్షుడు కామిరె శ్రీశైలం, ప్రొఫెసర్ కనకయ్య, వర్సిటీ ఉపాధ్యక్షుడు మహేశ్, ప్రధాన కార్యదర్శి సాగర్‌నాయక్, కార్యదర్శులు రాజేందర్, జి.శ్రీశైలం, గోవింద్, అపర్ణ, రమ్య, వర్ధన, పవిత్ర తదితరులు పాల్గొన్నారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో వర్సిటీ ప్రధాన కార్యదర్శి జయంతి, నాయకులు రవీందర్, హన్మాండ్లు, ఆకాశ్, మోహిత్, పవిత్ర, ప్రతిజ్ఞ, వర్ధన, రమ్య, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నిజామాబాద్‌అర్బన్: అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యానంద్, రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రెండు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు వెంటనే పెండింగ్ వేతనాలను మంజూరు చేయాలని కోరారు.

పదోన్నతులు కల్పించాలి

నిజామాబాద్‌అర్బన్: టెట్ ఉత్తీర్ణతతోనే ఉపాధ్యాయులకు పదోన్నతులు చేపట్టాలని టెట్ క్వాలిఫైడ్ టీచర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి పరశురాములు బుధవారం డిమాండ్ చేశారు. గతంలో 2015, 2017లో టెట్ పరీక్ష రాయాలని ఎన్‌సీఈటీ తెలిపినా రాష్ట్ర ఉన్నత అధికారులు పట్టించుకోలేదని అన్నారు. టెట్ నిర్వహణకు మళ్లీ ఎన్‌సీటీఈ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని అప్పటి వరకు ఉద్యోగోన్నతులు చేపట్టవద్దని డిమాండ్ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంలో తాత్కాలిక పద్ధతిన బోధించేందుకు సోషల్, వ్యాయామ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దుర్గారెడ్డి బుధవారం తెలిపారు. సోషల్ బోధించడానికి ఎంఏ. బీఈడీ, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టుకు బీపీఈడీ అర్హత కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు ఈ నెల 6లోగా దరఖాస్తులను సమర్పించాలన్నారు.మరిన్ని వివరాలకు 9704550259నంబర్‌నుసంప్రదించాలన్నారు.

సీఎంవో కార్యదర్శిగా జలాల్‌పూర్ వాసి

బాల్కొండ: మండలంలోని జలాల్‌పూర్‌కు చెందిన సీనియర్ ఐఎఫ్ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి కార్యాలయంలో కార్యదర్శిగా ఉద్యోగోన్నతి పొందడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన వెంకటరామిరెడ్డి, భాగ్యలక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం. అందులో చిన్నవాడైన చంద్రశేఖర్‌రెడ్డి ప్రస్తుతం ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సీఎంవో కార్యదర్శిగా ఉద్యోగోన్నతి పొందడంతో బదిలీపై హైదరాబాద్‌కు వెళ్లారు. మొదటి కుమారుడు విద్యాసాగర్‌రెడ్డి తెలంగాణ ప్రభుత్వ స్త్రీ నిధి శాఖలో, రెండవ కుమారుడు సుధాకర్‌రెడ్డి ఏపీలో ఇరిగేషన్ విభాగంలో చీఫ్ ఇంజినీర్‌గా పని చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన వ్యక్తులు ముగ్గురు ఉన్నత స్థానాల్లో ఉండటంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు

నిజామాబాద్‌అర్బన్: అనుమతి లేకుండా విధులకు గైర్హాజరవుతున్న ఓ ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసులు అందజేసినట్లు డీఈవో దుర్గాప్రసాద్ బుధవారం తెలిపారు. ధర్పల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ ఖయ్యూం అనే ఉపాధ్యాయుడు 2022 జూలై నుంచి విధులకు అనుమతి లేకుండానే గైర్హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సదరు ఉపాధ్యాయుడికి నోటీసులు పంపినా ఎలాంటి వివరణ రాకపోవడంతో షోకాజ్ నోటీసులు అందించినట్లు వెల్లడించారు. వారం రోజుల్లో వివరణ ఇవ్వకుంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని డీఈఓ పేర్కొన్నారు.

వేతనాలు రాక ఏఎన్ఎంల అవస్థలు


ఆందోళన చేస్తున్న రెండో ఏఎన్ఎంలు (ఫైల్)

మోర్తాడ్: వైద్య ఆరోగ్య శాఖలో రెండో ఏఎన్ఎంలుగా పని చేస్తున్న ఉద్యోగులకు రెండు నెలల నుంచి వేతనాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం రెండో ఏఎన్ఎంలకు వేతనాలు చెల్లించడానికి నిధులను కేటాయించకపోవడంతో వేతనాల చెల్లింపులు నిలిచిపోయాయి. నిధులు లేకపోవడంతో రెండో ఏఎన్ఎంల వేతనాల బిల్లును తయారు చేయలేకపోతున్నామని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 416 మంది రెండో ఏఎన్ఎంలు వివిధ పీహెచ్‌సీల పరిధిలో పని చేస్తున్నారు. మొదటి ఏఎన్ఎం లేని చోట రెండో ఏఎన్ఎంలను నియమించి వారితో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైద్య సేవలను కొనసాగిస్తున్నారు. రెండో ఏఎన్ఎంలను కాంట్రాక్టు పద్ధతిపైనే నియమించారు. కాంట్రాక్టు విధానంలో నియామకమైనా రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నామని రెండో ఏఎన్ఎంలు చెబుతున్నారు. గత ప్రభుత్వం వేతనాల చెల్లింపులో తీవ్ర నిర్లక్ష్యం వహించిందని అలాంటి పొరపాట్లు ఈ ప్రభుత్వం చేయకుండా సకాలంలో వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ప్రతి పంచాయతీకి రూ.10వేలు..

- 'ప్రజాపాలన' నిర్వహణకు నిధులు మంజూరు
- పెద్ద జీపీల్లో ఇబ్బందులు

మోర్తాడ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమ నిర్వహణకు జిల్లాలోని అన్ని పంచాయతీలకు రూ.10వేల చొప్పున ఆర్థికసాయాన్ని మంజూరు చేశారు. ప్రజాపాలన కార్యక్రమంతో జీపీలకు ఆర్థికభారం ఏర్పడవద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను కేటాయించింది. ప్రతి వంద కుటుంబాలకు ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేసి ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ ఉద్యోగులను నియమించి వారి ద్వారా అర్జీలను స్వీకరిస్తోంది. గత డిసెంబర్ 28 నుంచి మొదలైన ప్రజాపాలన కార్యక్రమం ఈనెల 6 వరకు కొనసాగనుంది. జిల్లాలో 530 జీపీలు ఉండగా రూ.53లక్షల నిధులను ప్రభుత్వం వెచ్చించింది. కానీ చిన్న జీపీల్లో మాత్రం నిధులు సరిపోతున్నా పెద్ద జీపీల్లో మాత్రం సరిపోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. జనాభా ఎక్కువగా ఉండడంతో కౌంటర్లను ఎక్కువగా ఏర్పాటు చేయాల్సి వస్తోందని ప్రభుత్వం నుంచి అందిన నిధులు సరిపోవడం లేదని పలువురు ఉద్యోగులు, సిబ్బంది పేర్కొంటున్నారు. ప్రభుత్వం కేటాయించిన నిధులతో పంచాయతీల నుంచి కొంత జత చేసి ఖర్చు చేయాల్సి వస్తుందని ఉద్యోగులు చెబుతున్నారు. జనాభా ఆధారంగా ప్రజాపాలన కార్యక్రమం కోసం నిధులను విడుదల చేసి ఉంటే బాగుండేదనే వాదన వినిపిస్తోంది. నిధుల కేటాయింపుపై ప్రభుత్వం పునరాలోచన చేసి పెద్ద జీపీలకు నిధులు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న నాయకులు

సుభాష్‌నగర్: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మానాయక్ సూచించారు. నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు పొందని వారు ఉండకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా నోడల్ అధికారి, ఎల్‌డీఎం నాగ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. గ్రామ ప్రజల ముంగిట్లోకి కేంద్ర పథకాలను తీసుకెళ్తున్నట్లు తెలిపారు. అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలనే అకుంఠిత దీక్షతో ప్రధాని నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. అనంతరం ముద్ర, పీఎం స్వానిధి రుణాల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో కూడిన కరపత్రాలు, గోడప్రతులు, క్యాలెండర్లను ఆవిష్కరించి ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌వైకే కోఆర్డినేటర్ శైలి బెల్లాల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, ఎస్‌బీఐ మేనేజర్ అరవింద్ కుమార్, రవి, మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ న్యాలం రాజు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



ఖలీల్ వాడి: భూత, వర్తమాన కాలానికి చెరిగిపోని జ్ఞాపకాలను పదిలపరిచే తీపిగుర్తులు డైరీలు, క్యాలెండర్లు అని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల అన్నారు. జిల్లా జ్యుడిషియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్-2024 వార్షిక డైరీ, క్యాలెండర్‌ను కోర్టు సమావేశపు హాల్‌లో అదనపు జిల్లా జడ్జిలు కనకదుర్గ, ఆశాలత, జూనియర్ సివిల్ జడ్జిలు గోపీకృష్ణ, కుష్బు, అసోసియేషన్ అధ్యక్షురాలు సుజాత, ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్‌తో కలిసి ఆవిష్కరించారు. డైరీ అనేది పదికాలాల పాటు చెరిగిపోని జ్ఞాపకాల మూట అని అన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నేతలు లింగారెడ్డి, చంద్రశేఖర్, ఎంఏ రషీద్, పద్మ, వెంకట లక్ష్మి, సుష్మా, దామోదర్‌రెడ్డి, అంజల్‌రెడ్డి పాల్గొన్నారు.

సొసైటీ అక్రమాలపై విచారణ చేపట్టాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సుభాష్‌నగర్: జిల్లాలోని సొసైటీల్లో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ యాదిరెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేల చొరవతో అనేక సొసైటీల్లో రూ.కోట్ల అవినీతి జరిగిందన్నారు. సొసైటీల్లో అక్రమాలపై విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో కిసాన్ మోర్చా ప్రధానకార్యదర్శి హరీశ్‌రెడ్డి, నాయకులు సుదర్శన్‌రెడ్డి, పంచరెడ్డి శ్రీధర్, మాధవరెడ్డి తదితరులు ఉన్నారు.

రెవెన్యూ సిబ్బందికి ప్రోత్సాహక వేతనం ఇవ్వాలి


పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు

సుభాష్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసి, ఎన్నికలు విజయవంతంగా పూర్తిచేసిన రెవెన్యూ అధికారులు, సిబ్బందికి ప్రోత్సాహక గౌరవ వేతనం ఇవ్వాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) ప్రతినిధులు కోరారు. ఈమేరకు వారు బుధవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్‌ను కలిసి, విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ల ప్రతిపాదనల ప్రకారం అదనపు బడ్జెట్ కేటాయించాలని కోరారు. దీనిపై ఎలక్షన్ సీఈఓ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. వంగరవీందర్‌రెడ్డి, గౌతమ్‌కుమార్, నజీమ్‌ఖాన్, మునీస్, రమన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆటోను ఢీకొన్న లారీ

- ఒకరి మృతి
- నలుగురికి తీవ్రగాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో


తండ్రి మృతదేహం వద్ద రోదిస్తున్న కుమారులు

నిజాంసాగర్: ఆటోను లారీని ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరో నలుగురికి తీవ్రగాయాలైన ఘటన కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం మాసానిపల్లికి చెందిన అయ్యప్ప స్వాములు ఎంబరి కాశయ్య, అంజయ్య, వల్లూరి విఠల్, మంగళి లింగం, సాయిలు ఆటోలో ఎల్లారెడ్డి మండలం మల్కాపూర్‌కు భిక్షకు వచ్చారు. పూజా కార్యక్రమంలో పాల్గొని స్వగ్రామానికి వెళ్తుండగా నిజాంసాగర్ మండల కేంద్రంలో ఎదురుగా వచ్చిన లారీ ఆటోను ఢీకొనగా మూడు పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో ఎంబరి కాశయ్య (55) మృతి చెందగా మిగతా నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సౌదీ అరేబియాలో దూస్‌గాం వాసి మృతి


ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

డిచ్‌పల్లి: మండలంలోని దూస్‌గాం గ్రామానికి చెందిన సురుకుట్ల ప్రవీణ్‌కుమార్ (31) సౌదీ అరేబియాలో మృతి చెందాడు. గ్రామస్తులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం .. బతుకుదెరువు కోసం సౌదీ అరేబియా దేశానికి వెళ్లిన ప్రవీణ్ కుమార్ అక్కడ ఎలక్ట్రీషియన్ పని చేస్తున్నాడు. మంగళవారం ఎప్పటిలాగే విధులు నిర్వహిస్తుండగా నిచ్చెన విరిగి సుమారు 15 అడుగుల ఎత్తునుంచి కింద పడ్డాడు. తలకు బలమైన దెబ్బ తగిలి తీవ్రరక్తస్రావం కావడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సమత, పిల్లలు అద్వీత (9), వేదశ్రీ (6) పిల్లలు ఉన్నారు. ప్రవీణ్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కుటుంబసభ్యులు, గ్రామస్తులు కోరుతున్నారు.

యువతి ఆత్మహత్య


ప్రియాంక మృతదేహం

జక్రాన్‌పల్లి: మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన దుబ్బాల ప్రియాంక(22) అనే యువతి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తిరుపతి బుధవారం తెలిపారు. ప్రియాంక పలు పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుంది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చౌట్‌పల్లి సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం



కమ్మర్‌పల్లి: మండలంలోని చౌట్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ప్రతాప్‌రెడ్డిపై డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటించారు. బుధవారం సహకారం సంఘం వైస్ చైర్మన్ గడ్డం శ్రీధర్, డైరెక్టర్లు కొమ్ముల రాజేందర్‌రెడ్డి, ఎలాల శంకర్‌రెడ్డి, ఏశాల ముత్తెన్న, ఏనుగు రాజేశ్వర్, నేల బుచ్చన్న, బాశెట్టి గంగాధర్ సమావేశమై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా సహకార అధికారి సింహాచలాన్ని కలిసి వినతి పత్రం అందజేశారు.